హామీలు గుర్తుకురావడం లేదా..?

- రేవంత్‌రెడ్డి గద్దెనెక్కి 21 నెలలు గడిచాయి
- పింఛన్లు పెంచేదెన్నడు?
- ఇప్పటికైనా స్పందించకుంటే ప్రత్యక్ష యుద్ధమే..
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

6

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




జయశంకర్ భూపాలపల్లి

గురువారం 25 సెప్టెంబరు 2025

సమ్మక్కసాగర్ బ్యారేజీ(ఫైల్)






సాగునీటి చిక్కులు 'సమ్మక్క' తీర్చేనా!?

- సమ్మక్కసాగర్‌కు ఎన్‌వోసీకి చత్తీస్‌గడ్ సానుకూలతపై హర్షం
- కాళేశ్వరం, సమ్మక్కసాగర్ కింద ఎస్సారెస్పీ-2 రెండు లక్షల ఎకరాల ఆయకట్టు
- రెండు ప్రాజెక్టుల కింద ఒకే ఆయకట్టును చూపటంపై సీడబ్ల్యుసీ అభ్యంతరాలు
- ఎన్‌వోసీ వచ్చినా.. కొత్తగా 2లక్షల ఎకరాల ఆయకట్టు చూపిస్తేనే అనుమతులు
- కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిచిపోవటంతో ఎస్సారెస్పీ-2కింద సాగునీటికి కొరత
- సీతారామ ప్రాజెక్టుకొత్త డిజైన్‌లో మహబూబాబాద్, డోర్నకల్‌కు దక్కని చోటు
- పాకాల నుంచి బయ్యారం వరకు గోదావరి జలాలను మళ్లించాలంటున్న రైతులు
- సమ్మక్క నీళ్లు ఎస్సారెస్పీ-2 స్థిరీకరణ, పాకాల-బయ్యారం కొత్త ఆయకట్టుకా..?

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సమ్మక్క సాగర్ బ్యారేజీకి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) ఇవ్వడానికి చత్తీస్‌గడ్ సానుకూలత వ్యక్తం చేయటం రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుండగా.. కొత్త ఆయకట్టుపై సీడబ్ల్యుసీ అభ్యంతరాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కింద చూపించిన ఎస్సారెస్పీ-2 ఆయకట్టును సమ్మక్క సాగర్ కింద చూపించటం ఏమిటని సీడబ్ల్యుసీ ప్రశ్నిస్తోంది. సమ్మక్కసాగర్‌కు కొత్త ఆయకట్టు చూపించాలని సీడబ్ల్యుసీ కోరుతోంది. దీంతో ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుకు అలైన్‌మెంట్ మార్పులతో మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు నియోజకవర్గాలకు సాగునీరు అందే పరిస్థితి లేనందున, పాకాల వరకు వెళుతున్న గోదావరి జలాలను బయ్యారం వరకు మళ్లించి కొత్తగా సమ్మక్కసాగర్‌కు ఆయకట్టును సృష్టించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సమ్మక్క నీళ్లను పాకాల నుంచి బయ్యారం మళ్లిస్తే.. కాళేశ్వరం ఎత్తిపోతలు లేకపోవటంతో ఎస్సారెస్పీ-2 కింద రైతులకు సాగునీటి పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. దీంతో సమ్మక్కసాగర్ నీటితో ఎస్సారెస్పీ-2 ఆయకట్టును స్థిరీకరించాలా? లేక పాకాల- బయ్యారం లింకులో కొత్త ఆయకట్టు సృష్టించాలానే సందిగ్ధం అధికారయంత్రాంగంలో నెలకొంది.



ఎస్సారెస్పీ-2పై అభ్యంతరాలు

దేవాదుల ఎత్తిపోతలను పెంచేందుకు ప్రభుత్వం 2018లో తుపాకులగూడెం వద్ద గోదావరిపై సమ్మక్కసాగర్‌ను నిర్మించింది. ఈ బ్యారేజీతో 6.94 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం

(మిగతా 7లో..)

సీతారామ కష్టాలను సమ్మక్క తీర్చేనా..?

భద్రాద్రి కొత్తగూడెంలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టును ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు గోదావరి నీరు అందించేందుకు ప్రభుత్వం చేపట్టింది. అయితే కిన్నెరసాని అభయారణ్యం కారణంగా అనుమతులు రావడంలో ఆలస్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ఇటీవల సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసింది. ఈ మార్పులతో మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాలోని బీడు భూములకు గోదావరి నుంచి నీరందే పరిస్థితి లేదు. సీతారామ ప్రాజెక్టుకు 2016లో శంకుస్థాపన చేసినప్పుడు టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు వద్ద 16 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. ఈ రిజర్వాయర్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారానే ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు నీరందించే వీలుంది. ఎలాంటి చిక్కులు లేకుండా సమ్మక్క బ్యారేజీ నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం నుంచి రోళ్లపాడుకు నీరందించి, ఆ లోటును భర్తీ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా సమాచారం. ఇప్పటికే సమ్మక్క సాగర్ నీరు దేవాదుల ద్వారా రామప్ప వరకు చేరుతోంది. రామప్ప నుంచి వరంగల్ జిల్లా పాకాల సరస్సులోకి మళ్లిస్తున్నారు. పాకాల నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద చెరువులోకి మళ్లించి, అక్కడి నుంచి ఇల్లందులోని రోళ్లపాడు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను మళ్లిస్తే.. సీతారామ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే అంశంపై ఇటీవల మంత్రి సీతక్క, ప్రభుత్వం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కొత్తగా లక్ష ఎకరాలకు వరకు సాగునీరు అందించటంతో పాటు మరో లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

యూరియా అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : యూరియా అక్రమ రవాణాపై పటిష్ట నిఘా పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. యూరియా సరఫరాపై టాస్క్‌ఫోర్స్ టీములు పటిష్టమైన నిఘా పెంచాలన్నారు. యూరియా ఎక్కువగా విక్రయాలు జరుపుతున్న మండలాల నివేదికను అందించాలని ఆదేశించారు. పీఏసీఎస్ కేంద్రాల వద్ద రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉంచాలన్నారు. యూరియా అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీంలు రిటైల్ షాపుల్లో తనిఖీలు చేపట్టాలని అన్నారు. ప్రైవేటు డీలర్లు కొన్ని చోట్ల యూరియాను బ్లాక్ చేసే అవకాశం ఉందని, పకడ్బందీగా తనిఖీలు చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో యూరియాకు కొరత లేదని తెలిపారు. రాబోయే 15 రోజులు చాలా కీలకమని, అధికారులు పర్యవేక్షణ పెంచాలని అన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. మొగుళ్లపల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణ చేపట్టామన్నారు. భూసేకరణ చేపట్టిన భూమిలో పంటలు సాగు చేపట్టకుండా, ఉన్న పంటలు త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతు బీమా క్లెయిమ్స్‌లో జాప్యం జరగకుండా సత్వరమే విచారణ చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో అవసరమైన యూరియా కోసం నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అదనపు సేల్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యాన అధికారి సునీల్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏలు, హార్టికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో క్రీడాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



విజేతకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, సింగరేణి జీఎం

కృష్ణకాలనీ, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): సింగరేణిలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంద ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అ న్నారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన క్రీడా పోటీలకు సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డితో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ఆరోగ్యం ముఖ్యమన్నారు. అప్పుడే రక్షణతో కూడిన బొగ్గు ఉత్పాదకత సాధించొచ్చన్నారు. సింగరేణి క్రీడలపై ప్రత్యేక దృష్టి పెడితే నిర్దేశిత లక్షాన్ని చేరుకుంటారన్నారు. అనంతరం వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీ సంపత్‌రావు, ఓస్‌వోటూ జీఎం కవీంద్ర, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్ కుమార్, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

జనరల్ అసిస్టెంట్లుగా బదిలీ వర్కర్లు

క్రమబద్ధీకరించేందుకు సింగరేణి కసరత్తు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో బదిలీ వర్కర్లుగా పని చేస్తున్న వారికి యాజమాన్యం శుభవార్త చెప్పింది. వారి సర్వీసులను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరించే ప్రక్రియను చేపట్టింది. వివిధ క్యాటగిరీల్లో సింగరేణిలో కార్మికులుగా నియమితులైన వారంతా తొలుత బదిలీ వర్కర్లుగా పని చేసుకుంటూ వస్తున్నారు. వీరి సర్వీసును బద్ధీకరించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ప్రధాన కార్యాలయం నుంచి అన్ని ఏరియాల్లోని కార్యాలయాలకు ఉత్తర్వులను జారీ చేసింది. భూపాలపల్లి ఏరియాకు సంబంధించి మొత్తం రెండు ఓపెన్‌కాస్టులు, నాలుగు భూగర్భ గనులు ఉన్నాయి. వీటిల్లో పని చేస్తున్న బదిలీ కార్మికులు ఎంత మంది ఉన్నారు.. ఆగస్టు 30 వరకు వీరి 190 మస్టర్లు పూర్తి చేశారా.. అలా చేసిన వారు ఎంత మంది అర్హులుగా ఉన్నారు? అనే జాబితాను పంపాలని యాజమాన్యం ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురువారం జాబితాను ఖరారు చేసి ప్రధాన కార్యాలయానికి పంపించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. భూపాలపల్లి ఏరియాలో సుమారు 1,800 మంది బదిలీ కార్మికులు ఉన్నట్లు అధికారులు అంటున్నారు.

చెవిని నోటకరిచి పట్టుకెళ్లిన కోతి

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ఘటన



కోతి దాడిలో చెవిని కోల్పోయిన రాజు

వెంకటాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి చేసిన కోతి అతడి చెవిని నోట కరిచి పట్టుకెళ్లిం ది. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశ వాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పూసల రాజు అనే గ్రామస్థుడు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన ఇంటి ఆవరణలో అతడు ఉండగా కోతుల గుంపు ఒక్కసారిగా అటువైపు వచ్చింది. కోతులను వెళ్లగొట్టేందుకు రాజు ప్రయత్నించగా అతడిపై అవి దాడి చేశాయి. ఒక కోతి రాజుపై పడి చెవిని నోటకర్చి పట్టుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అత డిని కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థాని కంగా కలకలం రేపింది. కోతులు దాడి చేసి గాయపర్చడాన్ని చూశాం గానీ ఇలా చెవిని కర్చుకొని తీసుకెళ్లడం ఎప్పుడూ చూడలేదని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

వెంకటాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని కలిపాక గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మిడం లక్ష్మి(55) మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము ఆమె ముఖం భాగంలో కాటేసింది. గమనించిన కుటుంబ సభ్యులు లక్ష్మిని ట్రాక్టర్ సహాయంతో కలిపాక నుంచి ఆలుబాక గ్రామానికి తీసుకెళ్లి అక్కడి నుంచి 108లో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతిచెందింది.

కాళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదుల నుంచి వరద పోటెత్తింది. దీంతో కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం పెరిగింది. 0.3 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది.

ప్రజలను మోసగించింది బీఆర్‌ఎస్సే..

- పదేళ్లలో ఒరగబెట్టిందేమీలేదు
- హామీలను మేం నెరవేరుస్తున్నాం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- భూపాలపల్లిలో దళిత మేధావుల విస్తృత స్థాయి సమావేశం





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర, ప్రీతం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, పైగా వంచనకు గురిచేసిందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన భూపాలపల్లి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన దళిత మేధావుల విస్తృత స్థాయి సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్విరామంగా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో రేషన్ కార్డుదారులకు తొమ్మిది వస్తువులు ఇస్తే... బీఆర్ఎస్ వచ్చాక వాటిని ఎగురగొట్టి కేవలం బియ్యంతోనే సరిపుచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక సోషల్ మీడియా వేదికగా బురద చల్లుతున్నారని మండిపడ్డారు. కొంత మంది మూర్ఖులు చేసే అసత్యపు ప్రచారాలను నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీల్లో క్యాటగిరీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అలాగే న్యాయపరమైన చిక్కులు లేకుండా బీసీ రిజర్వేషన్లను 42శాతం అమలు చేసేలా ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. దళితులకు, గిరిజనులకు పట్టం కట్టాలనే ఉద్దేశంలో భాగంగానే ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈ ప్రాంతానికి చెందిన ప్రీతంను, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా దండు రమేష్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో డీబీఎం 38 కాలువ పనుల కోసం నిధులు కేటాయిస్తామని, అంబేద్కర్ భవన్, ట్రైబల్ వెల్ఫేర్ భవనం, అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు, పూలే విగ్రహం, ఇందిరాగాంధీ విగ్రహం ఏర్పాట్ల కోసం కృషి చేస్తామని అన్నారు. త్వరలో యువ వికాసం రుణాలు కూడా అందిస్తామని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు 60 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిందని అన్నారు. హాస్టల్ విద్యార్థుల బాగోగుల కోసం మెస్ చార్జీలు పెంచిందని, సౌకర్యాలు మెరుగుపరిచిందని, అడ్డగోలుగా ప్రైవేటు యూనివర్సిటీలు తెస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వ యూనివర్సిటీలను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం నిధులు వెచ్చించి సహకారాన్ని అందించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. అలాగే కష్టపడ్డ నాయకులకు, కార్యకర్తలకు పదవుల ఎంపికలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, కాంగ్రెస్ నాయకులు పంతగాని సమ్మయ్య, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు తప్పని నిరీక్షణ

వివరాలు 8లో

ఘనంగా ప్రారంభమైన 'ఉదయం' షోరూం



సుబేదారిలో 'ఉదయం' షోరూమ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య

ప్రాంతీయ, సంప్రదాయ దుస్తులకు నిలయం

హనుమకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురుషుల నిర్దిష్ట ప్రాంతీయ, సంప్రదాయ దుస్తులకు సంబంధించి దక్షిణ భారతదేశంలోని అత్యంత విశ్వసనీయమైన పేర్లలో ఒకటైన 'ఉదయం' హనుమకొండలో తన ప్రత్యేక షోరూంను ఏర్పాటు చేసింది. సుబేదారి రోడ్డులో ఏర్పాటైన ఈ షోరూంను బుధవారం ఉదయం లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 320 ఎఫ్, సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, లయన్ డాక్టర్ కె.చంద్రశేఖర్ ఆర్య లాంఛనంగా ప్రారంభించారు. హనుమకొండ రెడ్‌క్రాస్ చైర్మన్, ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ్‌చందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా, ప్రాపర్టీ యజమాని వైట్ల జనార్ధన్ తొలి కొనుగోలు చేశారు. ఉదయం పూర్తిస్థాయి ఉత్పత్తులైన ధోతీలు, చొక్కాలు, వెడ్డింగ్ సెట్, మ్యాచింగ్ సెట్, నిర్దిష్ట ప్రాంతీయ సెట్, షర్టింగ్, సూటింగ్, పంచకచ్చమ్, చిన్నారుల ధోతీలు, చొక్కాలు, టవల్స్, లోదుస్తులు ఈ షోరూంలో అందుబాటులో వున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సంప్రదాయం, సొగసు, సౌకర్యాన్ని మిళితం చేసిన అపూర్వమైన షాపింగ్ అనుభవాన్ని కస్టమర్లు పొందవచ్చని తెలిపారు. నాణ్యత, సంప్రదాయం, నూతనత్వానికి సంబంధించిన నిబద్ధతతో వినియోగదారులకు నిర్దిష్ట ప్రాంతీయ, సహజమైన దుస్తులను అందించాలనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు.



ఎమ్మెల్యే గండ్రను సన్మానిస్తున్న ఓసీ-3 డ్రైవర్లు

సమ్మెను విరమించిన ఓసీ ట్రక్ డ్రైవర్లు

గణపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని గణపురం మండలం మాధవరావుపల్లి ఓపెన్‌కాస్టు-3 వోల్వో ట్రక్ ఆపరేటర్లు సమ్మెను విరమించారు. తమ సమస్యలను పరిష్కరించాలని మూడు రోజులుగా విధులను బహిష్కరించిన డ్రైవర్లు ఆందోళనలు చేస్తున్నారు. ఈక్రమంలో కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో బుధవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. సకాలంలో వేతనాలు చెల్లిస్తామని, ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో డ్రైవర్లు సమ్మెను విరమించారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును డ్రైవర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వోల్వో ట్రక్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు మాచర్ల కనకయ్య, బాలకృష్ణ, సురేందర్, దేవేందర్, మల్లేష్, అశోక్, దీపక్, చంద్రమౌళి, సంపత్, తిరుపతి, ఆకుతోట వేణు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి



నిఖిల్‌రాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీలు

కాటారం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులం విద్యార్థి నిఖిల్‌రాజ్ 17వ మినీ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల అండర్-12 విభాగం సెలక్షన్స్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 26నుంచి 29 వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నిఖిల్‌రాజ్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. నిఖిల్‌రాజ్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు

కాటారం, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దేవరాంపల్లిలో పేకాడుతున్న ఆరుగురిని పోలీసులు మంగళవార రాత్రి అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. గ్రామంలో పలువురు పేకాడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పేకాడుతున్న వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20,040 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రక్త మార్పిడిపై విచారణ

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒక రక్తానికి బదులు మరో రక్తం ఎక్కించి మహిళా రోగి జ్యోతికి సీరియస్ అయిన ఘటనపై మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రకుమార్ బుధవారం ఎంజీఎం ఆస్పత్రి సిబ్బంది విచారించారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురానికి చెందిన జ్యోతి (38) జ్వరంతో ఈ నెల 16న ఎంజీఎంలో చేరారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెంటనే రక్తం ఎక్కించాలని ఓ పాజిటివ్‌కు బదులు బిపాజిటివ్ రక్తం ఎక్కించిన విషయం తెలిసిందే. బాధితురాలి భర్త ఫిర్యాదుతో ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి నుంచి వచ్చిన విచారణ బృందం.. ఎంజీఎంలో బాధితురాలు చికిత్స పొందిన వార్డులో విచారణ చేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టు ఆధారంగా బుధవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్రకుమార్ ఎంజీఎం ఆస్పత్రికి వచ్చి విచారణ చేశారు. బ్లడ్‌బ్యాంకులో టెక్నీషియన్లు, వార్డులో ఆ రోజు విధుల్లో ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని విచారించారు. విచారణలో డీఎం తోపాటు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

హామీలు గుర్తుకురావడం లేదా..?

● రేవంత్ గద్దెనెక్కి 21 నెలలు గడిచాయి ● పింఛన్లు పెంచేదెన్నడు?
● ఇప్పటికైనా స్పందించకుంటే ప్రత్యక్ష యుద్ధమే.. ● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

రేగొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. గద్దెనెక్కి 21 నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రికి హామీలు గుర్తుకు రావడం లేదా? వికలాంగులకు, వృద్ధులకు పింఛన్లు పెంచేదెన్నడు? అని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మాచర్ల వంశీకృష్ణగౌడ్ అధ్యక్షతన బుధవారం జరిగిన సన్నాహక సదస్సులో మంద కృష్ణ మాదిగ మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచకుండా కాలయాపన చేస్తూ ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. పెన్షన్‌దారుల శక్తి ఏమిటో సీఎంకు తెలిసి వచ్చేలా ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

చేతకాకపోతే రాజీనామా చేయ్..

పక్క రాష్ట్రంలో చంద్రబాబునాయుడు పెన్షన్ పెంచి ఇస్తుంటే ఇక్కడి ముఖ్యమంత్రికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. హామీలు అమలు చేయడం చేతకాకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగ్లాలో పుట్టిన ముఖ్యమంత్రికి, గడీలో పుట్టిన కేసీఆర్‌కు పేదవాళ్ల కష్టాలు తెలియవని విమర్శించారు. అధికార పార్టీ మోసం చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలకు పట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మౌనం వీడి పెన్షన్‌దారులకు మద్దతుగా నిలబడాలన్నారు.

ప్రభుత్వం మెడలు వంచుతాం..

భూస్వాములకు భరోసా ఇచ్చేందుకు, కాంట్రాక్టర్ల బిల్లులకు పైసలు ఉంటాయి గానీ పోషణ శక్తి లేనివారికి ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వానికి మనసు రావడం లేదా? అని ప్రశ్నించారు. అక్టోబరులోగా పింఛన్లు పెంచకపోతే లక్షలాది మందితో పెరేడ్‌గ్రౌండ్‌లో మహాగర్జన సభ పెట్టి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శ్యాంమాదిగ, రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి, సీనియర్ నాయకులు శ్రీనివాస్, రాజేందర్, బొల్లి బాబు, మంద తిరుపతి, నేరెళ్ల ఓదెలు, నాయకులు కొండమల్ల విష్ణు, ఎర్రబద్రయ్య, రేణిగుండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

లెదర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కృషి చేస్తా

● ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నాగరిగరి ప్రీతం



నాగరిగరి ప్రీతంకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత చర్మకారులకు ఉపాధి కల్పించడంలో భాగంగా నెలకొల్పిన లెదర్ పార్కు, రెండు దశాబ్దాల కాలంగా వథాగా ఉంటుందని లెదర్ పార్కు పునరుద్దరణకు కృషి చేస్తానని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నాగరిగరి ప్రీతం తెలిపారు. భూపాలపల్లి పట్టణానికి వెళుతున్న ప్రీతంను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చేపూరి చిరంజీవి ఆధ్వర్యంలోని నాయకులు మండల కేంద్రంలో ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సత్కరించారు. నాయకులతో కలిసి బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లెదర్ వస్తువుల తయారీలో శిక్షణ పొంది 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చర్మకారులు, మండలంలోని నెమలిగొండ, సముద్రాల, పాంనూర్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలు పొందినప్పటికీ ఇళ్ల నిర్మాణాలు చేబట్టకుండా అధికారులు అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు చైర్మన్‌కు వినతిపత్రాలు అందించారు.

వెంటనే స్పందించిన ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోన్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించి సమస్యను వెంటనే పరిష్కరించి నిరుపేద దళితులు ఇళ్లు నిర్మించేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగపురం వెంకటయ్య, ఎమ్డీ యాకుబ్‌పాషా, గోనెల రాజయ్య, సింగపురం నాగయ్య, సింగపురం రాజు, నలిమెల ఏలియా, చాడ ఏలియా, నలిమెల నాగరాజు, గాదె శ్రీధర్, గుర్రం నవీన్, బాబు, మారపాక వసంత్, ఐలపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు



ఉప్పుగల్లులో ఓ వీధిలో ఊడ్చుతున్న వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి పాటుపడాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని ఉప్పుగల్లులో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, అంతర్గత రోడ్లు, తదితర సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా వెంకటేశ్వర్లుతో పాటు బీజేపీ నాయకులు చీపుర్లు చేతపట్టి వీధుల్లో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధ్వాన్నంగా ఉన్న అంతర్గత రోడ్లను నిర్మించాలని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, మాజీ సర్పంచ్ గాదెపాక చిరంజీవి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల రాజు, జిల్లా, మండల నాయకులు తిరుపతి, పవన్ గౌడ్, సాయిరాం, గోపాల్‌రావు, రాజయ్య, బుచ్చయ్య, శ్రీనివాస్, రత్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై గుండాల ఆగడాలను అరికట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



ఆశ్వరావుపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

రఘునాథపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులపై ఆక్రమంగా దౌర్జన్యానికి పాల్పడుతున్న పొట్లపల్లి కళాధర్ రావుకు చెందిన గుండాల ఆగడాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని ఆశ్వరావుపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 217లో గల వ్యవసాయ భూమిలో మండల ఎల్లయ్య, మండల వెంకటయ్య కుటుంబాలు సుమారు 70 ఏళ్ల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. గత రెండేళ్ల నుంచి ఇదే గ్రామానికి చెందిన పొట్లపల్లి కళాధర్‌రావు కుటుంబ సభ్యులు ఈ భూమిని ఆక్రమించుకోవడానికియత్నిస్తున్నారు. దీంతో బాధితులు సీపీఎం జిల్లా కమిటీని ఆశ్రయించగా, సీపీఎం బృందం బుధవారం ఆశ్వరావుపల్లికి చేరుకొని బాధిత రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ 217 సర్వే నెంబర్‌లో గల భూమితో ఎలాంటి సంబంధం లేని పొట్లపల్లి కళాధర్‌రావు కుటుంబ సభ్యులు, అతనికి సంబంధించిన గుండాలు పేద రైతులకు చెందిన సాగు చేసిన పంటలను, మోటారు పైపు లైన్లను ధ్వంసం చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సర్వే నిర్వహించేటట్లు చర్యలు తీసుకొని పేద రైతులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. లేనిపక్షంలో రైతులకు అండగా ఉంటూ జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, బొట్ల శేఖర్, భూక్య చందు, గంగాపురం మహేందర్, పొదల నాగరాజు, కడారి అంజనేయులు, ఐలయ్య, శాగ సాంబరాజు, నర్సయ్య, బుచ్చయ్య, శ్రీనివాస్, సమ్మయ్య, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్‌లో జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు భారత జాతీయ రహదారుల సాధికారత సంస్థ మేనేజర్ లింగయ్యకు వినతి పత్రం సమర్పించారు. స్టేషన్ ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి శ్రీ వాణి గురుకులం వరకు ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం, రహదారి వెంబడి ఉన్న గ్రామాల్లో కూడ సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఘన్‌పూర్ బస్టాండ్ ముందు సర్వీస్ రోడ్డు ధ్వంసం కావడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు సంభవిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జనగామ జిల్లా ఇన్‌చార్జీ జె.మల్లేశం, నియోజకవర్గ అధ్యక్షుడు జె.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందజేస్తున్నాం

జనగామ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందజేస్తున్నామని విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. జనగామ డివిజనల్ కార్యాలయంలో బుధవారం హెచ్‌టీ వినియోగదారులతో ఎస్ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ వేణుమాధవ్ మాట్లాడుతూ హెచ్‌టీ వినియోగదారులు ఆటోమేటిక్ వోల్టేజ్ రెగ్యులేటర్లను వాడాలని, యూనిట్ పవర్ ఫ్యాక్టర్ మెయింటైన్ చేయాలన్నారు. డీఈ శ్రీలక్ష్మి నారాయణ రెడ్డి, ఎస్ఏవో జయరాజు, వినియోగదారులు పాల్గొన్నారు.

దినసరి కార్మికుల వినూత్న నిరసన



ఐటీడీఏ ఎదుట చెవిలో పువ్వుతో నిరసన వ్యక్తం చేస్తున్న దినసరి కార్మికులు

ఏటూరునాగారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న దినసరి కార్మికులు చేస్తున్న సమ్మె 13వ రోజులకు చేరుకుంది. ఐటీడీఏ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద దినసరి కార్మికులు బుధవారం చెవిలో పూలు పెట్టుకొని వినూత్న నిరసనకు దిగారు. వీరికి గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు దుర్గి చిరంజీవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్లుగా డైలీవేజ్, కాంటినెంట్, పార్ట్‌టైమ్ వర్కర్లకు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు తగ్గడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 64 అమలును నిలిపివేసి, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 212 జీవోను సవరించి, 2014 నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారందరినీ పర్మనెంట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తొకల రవి, ఎం. నాగలక్ష్మి, సతీష్, సరిబాబు, సమ్మక్క, మౌనిక, నాగమణి తదితరలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం అండ



ఎల్‌వోసీ చెక్కులను పంపిణీ చేస్తున్న నాగపురి కిరణ్

జనగామ రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పెంబర్తికి చెందిన గోదల స్వాతికి రూ. 2.50 లక్షలు, మరిగడికి బొల్లి ఎల్లయ్యకు రూ. 1 లక్ష ఎల్‌వోసీ చెక్కులను కిరణ్ కుమార్ వారి కుటంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ఎల్‌వోసీ చెక్కులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెంబర్తి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బండ్రు సిద్దులు, మరిగడి గ్రామ శాఖ అధ్యక్షుడు కర్రే పరుశురాములు, నాయకులు గణిపాక మహేందర్, బ్లాక్ దూడల సిద్దయ్య, చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శీలం కొండల్ రెడ్డి, అంబాల అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదవర్గాలకు ఊరట

బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కదుగాయ రమేష్



ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చిలుపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ రేట్లతో పేదప్రజలకు ఊరట లభించనుందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ కదుగాయ రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని శ్రీపతిపల్లిలో ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల సంక్షేమం బీజేపీకే సాధ్యమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తోకల సంపత్‌రెడ్డి, జోగులు, రజనీకర్, ఎలిశాల శ్రీనివాస్, ప్రవిన్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7350	5300
మక్కలు	1850	1521
కందులు	5390	3022
పెసళ్లు	3790	3022
పల్లికాయ (సూక)	6260	3500
పల్లికాయ (పచ్చిది)	4400	2400
పసుపు (కాడి)	11522	7889
పసుపు (గోల)	9500	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16500	12000
యూఎస్341ఏసీ	14700	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

యూరియా బ్లాక్ మార్కెట్‌పై కలెక్టర్ సీరియస్!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా బ్లాక్ మార్కెట్ అంశాన్ని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. 'బ్లాక్ మార్కెట్‌లోకి యూరియా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించినట్టు సమాచారం. యూరియా పక్కదారి పట్టడం పట్ల వ్యవసాయ శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. యూరియా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరికలు జారిచేసినట్టు సమాచారం. ప్రైవేటు నిర్వాహకులు యూరియాను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తుంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది.

ఒక్కో బస్తా రూ. 700 విక్రయం

డీసీఎంఎస్, ఆగ్రోస్‌తో పాటు పలు ప్రైవేటు నిర్వాహకుల లీలలు ఒక్కొకటిగా బయటకు వస్తున్నాయి. ఒక్క యూరియా బస్తా రైతులకు ఇచ్చి, అదే రైతు పేరున ఈ-పాస్ మిషన్లలో మూడు వరకు నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా రైతులను మోసం చేసి కూడబెట్టిన యూరియా బస్తాలను ఇతర రైతులవి అంటూ గుట్టు చప్పుడు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. ఇలా తరలించిన ఒక్కో బస్తాకు రూ.700కు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఇలా రెండు నెలలుగా యూరియా అక్రమ విక్రయాలకు పాల్పడుతుండగా సంబంధిత అధికారులే వారికి అండగా నిలుస్తున్నారనే చర్చ సాగుతోంది.

ఫార్మసిస్టులపై నిర్లక్ష్యమేల!?

- ఉమ్మడి జిల్లాలో 70కి పైగా ఫార్మసిస్టు పోస్టులు ఖాళీ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల కొరత
- ఉన్నవారిపైనే అధిక పనిభారం
- సక్రమంగా అమలుకాని చట్టం
- నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

హనుమకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫార్మసిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోగికి మందులు అందజేయడం మొదలు పెట్టినప్పటి నుంచి రోగం నయం అయ్యే వరకు ప్రతీ దశలోనూ ఫార్మసిస్టు కీలక పాత్ర పోషిస్తారు. పరిశోధనలు చేసి ఔషధాలను కనిపెట్టే వారు, వాటిని తయారు చేసేవారు, ప్రజలకు చేరవేసే వారు, ఔషధ గుణాలను రోగికి వివరించి సలహాలు సూచనలు అందించే మెరుగైన వైద్యవనరులుగా ఫార్మసిస్టులను వినియోగించుకోవలసిన ప్రభుత్వాలు వారి విషయంలో చిన్నచూపును ప్రదర్శిస్తున్నాయి.

మందుల కొరత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రా లు, బస్తీ దవాఖానాలలో తీవ్రమైన మందుల కొరత ఉంది. రోగు లు బయట మందులు కొనుక్కోవలసిన పరిస్థితి ఉంది. రోగులు ఇందుకు ఫార్మసిస్టులను బాధ్యులను చేస్తూ వారిపై దూషణలకు దిగుతుండడం తరుచూ జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో మందులు ఉన్నా ఇవ్వడం లేదన్న కోపంతో వారిపై దాడు లు జరిగిన ఉదంతాలు కూడా ఉన్నాయి. మందుల కొరతను నివారించడంలో ఫార్మసిస్టులకు వైద్యులు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు సహకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వీరితో కొరవడిన సమన్వయం ఫార్మసిస్టులను ఇబ్బందుల పాలు చేస్తోంది. కమ్యూనిటీ ఫార్మసీలలో రోగులు ఎదుర్కొనే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొవడంలో ఫార్మసిస్టులకు శిక్షణ, వనరులు అవసరం. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



అర్హులెక్కడ?

ఉమ్మడి జిల్లాలో 2400 రిటేల్ మెడికల్ షాపులు, 450 మెడికల్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో అర్హులైన ఫార్మసిస్టులు ఉండడం లేదు. నిబంధనల ప్రకారం వారి సర్టిఫికెట్ల ఆధారంగానే లైసెన్సులు తీసుకుంటున్నారు. పేరుకు షాపుల్లో గోడలపై సర్టిఫికెట్లు దర్శనమిస్తున్నాయి కానీ.. అందులో వారు ఉండడం లేదు. ఇది ఫార్మసీ చట్టానికి విరుద్ధం. ఒక ఫార్మసిస్టు తన సర్టిఫికెట్‌ను అనధికారికంగా ఇంకొకరి దగ్గర కుదువ పెట్టరాదు. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నది ఇదే. మందుల షాపులు, మెడికల్ ఏజెన్సీల నిర్వాహకులు లైసెన్సుడు ఫార్మసిస్టులను తగిన వేతనంతో ఉద్యోగాల్లో పెట్టుకుంటే చాలా వరకు నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుంది.

పదినెలవుతున్నా ఫలితాలేవి?

రాష్ట్రవ్యాప్తంగా 700 ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కిందటేడు నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 98 పోస్టులు ఉన్నాయి. పరీక్షలు పూర్తయినా ఇంత వరకు ఫలితాలను ప్రకటించలేదు. పరీక్ష రాసిన నిరుద్యోగులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొంత మంది కోర్టుకు వెళ్లడం వల్ల ఫలితాల ప్రకటనలో జాప్యం జరుగుతున్నట్టు చెబుతున్నా ఈ విషయంలో ప్రభుత్వం తన వంతు చొరవ చూపడం లేదు.

డైరెక్టర్ పోస్టు భర్తీ ఎప్పుడు?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ పోస్టు ఆంధ్రకు వెళ్లింది. తెలంగాణలో ఈ డైరెక్టర్ పోస్టు ఇప్పటికీ ఖాళీగానే ఉంది. ఎంతో కాలం తర్వాత డైరెక్టర్ పోస్టు మంజూరైనా భర్తీ మాత్రం జరగలేదు. ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించి నెట్టుకువస్తున్నారు. అన్ని అర్హతలున్న, ఫార్మసిస్టు నిపుణులను డైరెక్టర్‌గా నియమించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 71 డ్రగ్ఇన్స్‌పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరు పోస్టులు ఇప్పటికీ భర్తీ కాలేదు.

పెద్ద సంఖ్యలో ఖాళీలు

ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో ఫార్మసిస్టుల కొరత తీవ్రంగా ఉంది. పెద్ద సంఖ్యలో ఫార్మసిస్టుల ఖాళీలు ఉన్నాయి. ఫార్మసిస్టులు లేని చోట డాక్టర్లు, చివరికి నర్సులే ఫార్మసిస్టుల అవతారం ఎత్తి రోగులకు మందులను అందజేస్తున్నారు. రోగుల సంఖ్యకు సరిపడే ఫార్మసిస్టులు లేకపోవడం వల్ల ఉన్నవారిపైనే అధిక పని భారం పడుతోంది. ఆస్పత్రుల్లోని మందుల కౌంటర్లలో అత్యవసర రోగులకు అవసరమైన మందులను అందచేయడానికి నైట్ డ్యూటీలో ఫార్మసిస్టులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల పోస్టుల ఖాళీ వల్ల నైట్ డ్యూటీలో ఫార్మసిస్టులు లేక రోగులు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను గుర్తించాలి



ప్రజారోగ్య సంక్షేమంలో కీలకమైన ఫార్మసీ వృత్తి ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించాలి. రాష్ట్రంలోని ఫార్మసిస్టుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఫార్మసిస్టుల ఉద్యోగావకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలి. ఫార్మసీ కోర్సుపూర్తి చేసినవారికి ఫార్మసీ కళాశాలల్లో బోధన సిబ్బందిగా, డ్రగ్ కంట్రోల్ శాఖలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్లుగా, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లలో అసిస్టెంట్లుగా ప్రభుత్వం నియమించాలి. ఫార్మసీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలి. ఫార్మసిస్టుల పోస్టుల పరీక్షా ఫలితాలను వెంటనే ప్రకటించాలి. మెరిట్ అభ్యర్థులతో నియామకాలు చేపట్టాలి.

ఉప్పు భాస్కర్‌రావు,
రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు



పర్వతగిరిలో ఎర్రబెల్లికి తమ బాధలు చెప్పుకుంటున్న మహిళా రైతులు

రైతుల బాధలు కనిపించడం లేదా?

మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆగ్రహం

పర్వతగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రికి రైతుల బాధలు కనిపించడం లేదా? అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంపై అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పర్వతగిరి మండల కేంద్రంతోపాటు కల్లెడ పీఏసీఎస్ వద్ద రైతుల దీనస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల గోడును విని ధైర్యం చెప్పారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ రైతులు అర్ధరాత్రి నుంచి క్యూలెన్లు కట్టి యూరియా కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని, పాలన చేతగాక కాంగ్రెస్ నాయకులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే..

పర్వతగిరిలోని తన నివాసంలో దయాకర్‌రావు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పట్ల సైతం మేధావులు, యువకులు, మహిళలు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు.

అనంతరం పర్వతగిరిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, లునావత్ పంతులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బోయినపెల్లి యుగేందర్‌రావు, గోనె సంపత్, దేవేందర్, రాజు, శ్రీనివాస్, వెంకన్న, మాధవరావు, శ్రీను, జిల్లా, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శలు...

రాయపర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యతండాలో యూరియా క్యూలైన్‌లో జరిగిన తోపులాటలో గాయపడిన మునావత్ మాంజ్యా నాయక్‌ను బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం పెర్కవేడు గ్రామంలోని గుంటూరుపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాకినేని వీరయ్య అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

సూర్యతండాకు చెందిన లైన్‌మన్ మునావత్ హన్మంత్ విధుల్లో ఉండగా జరిగిన ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతుండగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జట్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, పూస మధు తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీకి ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ అవార్డు

రాష్ట్రపతి నుంచి స్వీకరణ

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ పట్టణానికి చెందిన వర్ధమాన సినీ కళాకారుడు ఉప్పరి పృథ్వీకి జాతీయ స్థాయిలో ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ అవార్డు వరించింది. ఈ అవార్డును ఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. పృథ్వీ తండ్రి శేఖర్ డోర్నకల్‌లో కుంగ్‌ఫూ మాస్టర్‌గా ఎంతోమందికి శిక్షణ ఇచ్చారు.

ఈ కళ ద్వారా రైల్వేలో ఉద్యోగం సాధించిన ఆయన అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత తెలుగు సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా పనిచేస్తూ.. పలు చిత్రా ల్లో పాత్రలు పోషించారు. ఈ క్రమంలో తన కుమారుడు పృథ్వీకి కుంగ్‌ఫూలో శిక్షణ ఇచ్చారు. తన తండ్రి దగ్గర మెళకువలు నేర్చుకున్న ఆయన పలు సినిమాలకు స్టంట్ మాస్టర్‌గా కొరియోగ్రాఫర్‌గా పని చేశారు.

ఇటీవల ప్రకటించిన జాతీయ ఉత్తమ స్థాయి చిత్రాలలో ఒకటైన 'హనుమాన్' చిత్రంలో పృథ్వీ నటించడంతో పాటు స్టంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేశారు. దీంతో ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డోర్నకల్ ప్రాంత వాసులు పృథ్వీకి అభినందనలు తెలిపారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న డోర్నకల్‌కు చెందిన ఉప్పరి పృథ్వీ

ఫోన్‌లోనే బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు

- కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి
- కుడా కార్యాలయంలో అవగాహన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇకపై ఇండ్లు నిర్మించుకునే వారు ఫోన్‌లోనే బిల్డ్‌నౌ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చని కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కుడా సీపీవో అజిత్‌రెడ్డితో పాటు 120 గ్రామాల ఆర్‌ఐలు, పంచాయతీ సెక్రెటరీలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. బిల్డ్‌నౌ యాప్ ఏఐ సిస్టం ద్వారా భవన అనుమతులు నిమిషాల్లో పొందే విధంగా రూపొందించామ న్నారు. అధికారుల జోక్యం లేకుండా పారదర్శకతతో అనుమతులు జారీ చేస్తామన్నారు. దరఖాస్తుదారులు కార్యాలయా నికి రాకుండా ఇండ్ల వద్ద నుంచే అనుమతులు పొందవచ్చన్నారు. వాట్సాప్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందిస్తూ వినియోగదారులు దరఖాస్తుల స్టేటస్‌లు తెలుపుతుందని అన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనిచేసేందుకు బిల్డ్‌నౌ యాప్‌ను రూపొందించామన్నారు. అదే విధంగా ఇంటి స్థలం 75 గజాలలోపు ఉంటే దరఖాస్తును సమర్పించిన వెంటనే అనుమతులు జారీ అవుతాయన్నారు. టీడీసీపీ, పట్టణాభివృద్ధి సంస్థలు, అగ్నిమాపకశాఖ, నీటి పారుదల శాఖ, రెవెన్యూ తదితర శాఖలన్నింటినీ బిల్డ్‌నౌ యాప్‌కు అనుసంధానం చేశామని వెంకట్రాంరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుడా చైర్మెన్ వెంకట్రాంరెడ్డి

పథకాలు, పనులు అమ్ముకున్న చరిత్ర రాజయ్యది

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- చిలుపూర్‌లో లబ్దిదారులకు చెక్కుల పంపిణీ

చిలుపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత పదిహేనేళ్ళుగా నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి పనులు, పథకాలను అమ్ముకున్న చరిత్ర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వరలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో రూ. 53 లక్షల విలువ గల కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన అనతికాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతు రుణమాఫీతో పాటు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకా లను అమలు చేస్తున్న తీరు దేశానికే మార్గదర్శకమన్నారు. కేవలం 21 నెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.1025 కోట్లను మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మార్కెట్ చైర్మన్ లావణ్యరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎమ్మార్వై అర్జున్, గడ్డమీది సురేశ్, రత్నాకర్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, ఎమ్డీ షకీల్, ఏడవెళ్ళి మల్లారెడ్డి, తాళ్ళపల్లి సమ్మయ్య, జీడి ఆనందం తదితరులు పాల్గొన్నారు.



చిలుపూర్‌లో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

తాటికొండలో వనిత టీస్టాల్ ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధితోనే సమాజంలో నేడు కుటుంబాలు జీవిస్తున్నాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం మండలంలోని తాటికొండ గ్రామంలో ఇందిరా మహిళశక్తి కార్యక్రమంలో భాగంగా కుంబోజు మధుమాల-రాజు దంపతులు ఏర్పాటు చేసిన వనిత టీస్టాల్‌ను కడియం ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు ఏడు ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఏడు మండలాలకు ఏడు పెట్రోల్ పంప్‌లను మహిళా సంఘాలకు ఇచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, బేతి జయపాల్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బేతి మంజుల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భళా పోలీస్!

- ఐనవోలు మండలంలో వినూత్న కార్యక్రమం
- ద్విచక్ర వాహనాలపై గస్తీ తిరుగుతూ ప్రజలతో మాటామంతీ
- పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచన
- వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు...



నందనంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మామునూరు ఏసీపీ వెంకటేష్, సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఐనవోలు మండలంలో పోలీసులు బుధవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రజలను చైతన్య పరిచే ఉద్దేశ్యంతో గ్రామాల్లో ద్విచక్ర వాహనాలపై గస్తీ తిరుగుతూ భరోసా కల్పించారు. ప్రజలతో స్వయంగా మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. నేరాలపై అప్రమత్తంగాఉండాలంటూ అవగాహన కల్పించారు. పండుగను ప్రశాంతంగా జరుపుకొని ఆనందంగా గడపాలని సూచించారు. మామునూరు ఏసీపీ వెంకటేష్ నేతృత్వంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్, పోలీసు సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ సూచనలు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు వివాదాలకు తావులేకుండా పండుగలు జరుపుకోవాలని కోరారు. పండుగల్లో రాజకీయాలు చేసి గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పండుగల వేళ చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి గ్రామంలో ప్రవేశ మార్గాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను యువతకు వివరించారు. సైబర్ నేరాలు జరిగే విధానం, వాటి బారిన పడకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. గస్తీ సందర్భం గా వివిధ గ్రామాల్లో బతుకమ్మలు ఆడే స్థలాలను పరిశీలించారు. కాగా, పోలీసులు ఈ చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సాగునీటి చిక్కులు 'సమ్మక్క' తీర్చేనా!?


(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ ప్రాజెక్టుకు ఇన్నాళ్లు కొర్రీలు పెట్టిన చత్తీస్‌గడ్ ప్రభుత్వం ఇటీవలే సానుకూల వ్యక్తం చేయటం రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. దేవాదులు మూడు దశల పనులు పూర్తి కావస్తుడటంతో పాటు భూసేకరణపై ప్రభుత్వం దృష్టి సారించటంతో దేవాదుల కల సాకారం అవుతుందనే ఆనందం రైతుల్లో వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో సాగునీటిపై కొత్త చిక్కులు తెరపైకి వస్తున్నాయి. సమ్మక్కసాగర్ నుంచి 2,51,310 హెక్టార్లకు సాగునీటితో పాటు ఎస్సారెస్పీ ఫేస్-2లో 1,78,000హెక్టార్ల (4.45 లక్షల ఎకరాలు) ఆయకట్టును స్థిరీకరించనున్నట్లుగా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లో పేర్కొన్నారు. అయితే ఇదే ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో ప్రభుత్వం చూపించింది. ఎస్సారెస్పీ-2 పరిధిలోని ఆయకట్టును కాళేశ్వరం ప్రాజెక్టు, సమ్మక్కసాగర్‌లకు రెండింటికి డీపీఆర్‌లో చూపించటంపై కేంద్ర జలవనరుల సంఘం అభ్యంతరాలు తెలిపింది. ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టును కాళేశ్వరం ప్రాజక్టుకే పరిమితం చేస్తే, సమ్మక్కసాగర్ సంబంధించిన ప్రాజెక్టు ప్రయోజనాల వ్యయం(కాస్ట్ బెనిఫిట్‌రేషియో) తగ్గుతోంది. ప్రస్తుత డీపీఆర్‌లో ఒక రూపాయి ఈ ప్రాజక్టుపై ఖర్చు చేస్తే.. కొత్త పాత ఆయకట్టుల ద్వారా రూ.1.67 లాభం వస్తుందని సీడబ్ల్యూసీకి తెలిపారు. కానీ ఎస్సారెస్పీ-2 ఆయకట్టును తొలగిస్తే రూపాయిన్నర ఖర్చుకు రూపాయి వరకు కూడా ప్రయోజనం కనిపించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో సమ్మక్క బ్యారేజ్ కింద కొత్తగా రెండు లక్షల ఆయకట్టును చూపాలంటూ కేంద్ర జల సంఘం సూచించింది.

ఎస్సారెస్పీ-2 ఆయకట్టుకు నీటి కష్టాలేనా..?


శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు రెండు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.74లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సారెస్పీ-1 కింద 3,64,078 ఎకరాల్లో, ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టు ఉందని అంచనా. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఈ ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా గత ప్రభుత్వం కేంద్ర జలమండలికి నివేదిక ఇచ్చింది. అయితే సమ్మక్కసాగర్ నిర్మాణంతో దేవాదుల ఎత్తిపోతల కింద కొత్త ఆయకట్టును ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో ఎస్సారెస్పీ-2 కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తున్నట్లుగా ప్రభుత్వం సీడబ్ల్యూసీకి డీపీఆర్‌లో చూపించింది. రెండు ప్రాజెక్టుల కింద ఎస్సారెస్పీ ఆయకట్టును చూపించటంతో సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో కొత్తగా పాకాల-బయ్యారం- రోళ్లపాడు వరకు సమ్మక్కసాగర్ నీటిని ఎత్తిపోయాలని ప్రభు త్వం ప్రణాళిక రూపొందిస్తోంది. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు నియోజకవర్గాలోని రైతులకు ప్రయోజనం చేకూరుతందని అంచనా వేస్తున్నారు. దీంతో ఎస్సారెస్పీ-2 కింద ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం పక్కన పెట్టింది. రెండేళ్లుగా కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయటం లేదు. ఎస్సారెస్పీ-2 కింద ఉన్న సమ్మక్కసాగర్ నీటిని పాకాల- బయ్యారం మళ్లిస్తే.. తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గంలో 44,942 ఎకరాలు, వర్ధన్నపేటలో 9,012 ఎకరాలు, డోర్నకల్‌లో 55,558 ఎకరాలకు ఎస్సారెస్పీ-2 ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయి. భవిష్యత్తులో కూడా కాళేశ్వరం ఎత్తిపోతల చేపట్టే సూచనలు కనిపించటం లేదని, దీంతో ఎస్సారెస్పీ-2 కింద 1,09,512 ఎకరాల ఆయకట్టుకు మళ్లీ కరువు వస్తుందనే ఆవేదనలో రైతులు ఉన్నారు. దీంతో సీడబ్ల్యూసీ అభ్యంతరాలకు సమాధానం ఇచ్చి ఎస్సారెస్పీ-2 ఆయకట్టుకు నీటిని మళ్లించాలా? లేక కొత్త ఆయకట్టు కోసం పాకాల- బయ్యారం వరకు సమ్మక్కసాగర్ నీటిని ఎత్తిపోసేలా కొత్త డీపీఆర్‌ను తయారు చేయాలా అనే సందిగ్ధం అధికారుల్లో నెలకొంది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
గురువారం 25 సెప్టెంబరు 2025



నిరుద్యోగులకు తప్పని నిరీక్షణ

- రాజీవ్ యువ వికాసం పథకంపై స్పష్టత కరువు
- ఆశగా ఎదురుచూస్తున్న యువత
- జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 20,386 మంది



వెంకటాపూర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు నిరీక్షణ తప్పడం లేదు. జీవనోపాధి కల్పిస్తామంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సకాలంలో వారికి దరిచేరడం లేదు. 'రాజీవ్ యువ వికాసం' కోసం దరఖాస్తు చేసుకున్న యువత పరిస్థితే ఇందుకు నిదర్శనం.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పేరుతో సంక్షేమ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. ఆ తర్వాత ఈ పథకంపై స్పష్టత కొరవడింది. దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా ముందడుగు పడటం లేదు. దీంతో రుణాలు లభించి జీవనోపాధి దొరుకుతుందనుకున్న నిరుద్యోగ యువతకు నిరీక్షణ తప్పడం లేదు.

అమలులో జాప్యం ఎందుకో...

రాజీవ్ యువ వికాసం పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న నిరుద్యోగులు హార్డ్ కాపీలను మండల పరిషత్ కార్యాలయాల్లో అందించారు. ఈ పథకంలో రూ. 50వేల నుంచి రూ. 4లక్షల వరకు రుణాలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు దరఖాస్తులు చేసుకున్న వారికి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అంది స్తామని లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయినా ఇప్పటి వరకు దాని ఊసే లేదు. మంత్రివర్గ సమావేశం ం అమలుపై నిర్ణయాలు తీసుకుంటారని తెలిపినా ఇప్పటి వరకు స్పష్టత లేదు.

జిల్లాలో ఇలా....

ములుగు జిల్లా వ్యాప్తంగా 174 రెవెన్యూ గ్రామాల పరిధిలో 20,386 మంది నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఎస్సీ కార్పొరేషన్ కింద 4,428, ఎస్టీ కార్పొరేషన్ కింద 6,155, మైనారిటీ కార్పొరేషన్ కింద 630, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ 8, బీసీ కార్పొరేషన్ కింద 1,630, ఎంబీసీ కార్పొరేషన్ కింద 77, ఈబీసీ కార్పొరేషన్ కింద 426, ఆల్ బీసీ ఫేడరేషన్ కింద 7,032 మంది అర్జీలు పెట్టుకున్నారు. .



హామీని నిలబెట్టుకోవాలి

అధికారంలోకి వస్తే యువతకు జీవనోపాధి కల్పిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారం చేజిక్కించుకున్నాక విస్మరించింది. రాజీవ్ యువ వికాసం పథకం కోసం యువత నుంచి దరఖాస్తులు స్వీకరించిన సర్కార్ నేటికీ అమలు చేయలేదు. ఇప్పటికైనా యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.



- లింగాల రమణారెడ్డి,
బీఆర్ఎస్ వెంకటాపూర్ మండల అధ్యక్షుడు

ఆదివాసీల దాడుల నుంచి
బీసీలకు రక్షణ కల్పించండి

తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సాగర్



కలెక్టరేట్ వద్ద మాదంసాగర్ తదితరులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఆదివాసీల దాడుల నుంచి బీసీలకు రక్షణ కల్పించాలని కలెక్టర్ దివాకరను తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మాదం సాగర్ కోరారు. ఈమేరకు బుధవారం ఆయన పలువురు నాయకులు, రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సాగర్ మాట్లాడుతూ వెంకటాపురం మండలం నేలవారిపేట పరిధిలోని బండారుపల్లి శివారు సర్వేనంబర్ 11,22,23లో ఉన్న భూముల్లో పేద యాదవులు పూర్వకాలం నుంచి వర్షాధార పంటలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. అయితే ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీలు కొందరు యాదవులు వేసుకున్న పంటలను కోసుకెళ్తూ దౌర్జన్యం చేస్తున్నారని, భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ చొరవ తీసుకుని యాదవుల భూములకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ నాయకులతోపాటు యాదవ రైతులు యాసం కృష్ణమూర్తి, గంగాభవాని, నూకల రమేష్, దామోదర్‌రావు, రామెళ్ల సత్యనారాయణ, తాండ్ర పోతరాజు, మోహన్‌రాజు, లక్ష్మి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ధరల పట్టికను దుకాణాల వద్ద ప్రదర్శించాలి : సీపీఐ

ములుగు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ ధరల పట్టికను దుకాణాల ముందు తప్పనిసరిగా ప్రదర్శించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.డి.అమ్జద్ పాషా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి ముత్యాల రాజు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో అమ్జద్ పాషా మాట్లాడుతూ హోల్‌సేల్, టోకు వ్యాపారులు వినియోగదారులను మోసం చేసే అవకాశం ఉందని, దున జీఎస్టీ ధరలను జిల్లాలోని అన్ని దుకాణాల ముందు నోటీస్ బోర్డులో ధరల పట్టికను అంటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు డిమాండ్ చేశారు. జీఎస్టీ పరిధిలోనికి డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను కూడా చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఇంజన్ కొమురయ్య, మండల కమిటీ సభ్యులు మామిడి నటరాజ్, వాంకుడోత్ వెంకట్రావు, పుల్యాల రాంబాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన మలేరియా నియంత్రణ అధికారి

వాజేడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మలేరియా నియంత్రణ జోనల్ అధికారి సునీల్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో నమోదు అవుతున్న డెంగీ, మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని రికార్డులను, ల్యాబ్, మందుల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి మహేందర్, సీహెచ్‌వో దుర్గారావు, ఎంపీహెచ్‌ఈవో సతీష్‌కుమార్, వైద్యశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

వెంకటాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలివ్వాలని కోరుతూ బుధవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ బోదాపురం గ్రామంలో ఆదివాసీలు సాగుచేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలివ్వడంలో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. దీంతో ఆ భూములను అటవీశాఖ అధికారులు అక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆదివాసీలు సాగుచేసుకుంటున్న భూములకు అటవీశాఖ అధికారులు అడ్డురావొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తాటి రాంబాబు, చందర్‌రావు, నవజీవనబాబు,నిమ్మయ్య, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం



ఎంబీబీఎస్ సీటు సాధించిన లక్ష్మీరాజును సన్మానిస్తున్న గ్రామస్థులు

తాడ్వాయి సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రతిభను చాటిన మండల విద్యార్థులను గ్రామస్థులు బుధవారం సన్మానించారు. మేడారం గ్రామానికి చెందిన మండపు లక్ష్మీరాజు గోదావరిఖని సింగరేణి మెడికల్ కాలేజీలో ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించగా అదే గ్రామానికి చెందిన నాయకపోడ్ సేవా సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు గుండ్ల రాజు, సమ్మక్క పూజారి సిద్ధబోయిన స్వామి, రాణా రమేష్, మాజీ సర్పంచ్ చిదం బాబురావు, ఆదివాసీ మ్యూజియం క్యూరేటర్ కుర్సం రవి, యువకులు, రాజకీయ నాయకులు గ్రామ పంచాయతీ ఆవరణలో సన్మానించారు. అదే విధంగా కాటాపూర్ గ్రామానికి చెందిన రేవంత్ గౌడ్ అండర్- 19 క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గౌడ సంఘం ఆధ్వర్యంలో చిన్న నర్సయ్య, సదయ్య, కిరణ్ కుమార్, కాంగ్రెస్‌నాయకులు ముజాఫర్, సతీష్, రాములు, యుజవన నాయకులు ఖలీల్, సద్దాం, రహమాన్, అక్రం, అజ్హర్ తదితరులు సన్మానించారు. విద్యార్థులు మరింత ఉన్నత స్థాయిలోకి చేరుకోవాలని కోరారు.

రైతులు సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

తాడ్వాయి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పండించిన పత్తి, ఇతర పంటల వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల ఉప అధికారి నవీన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సీసీఐ నిబంధనల ప్రకారం కపాస్ కిసాన్ యాప్ ద్వారానే పత్తి కొనుగోలు జరుగుతుందని తెలిపారు. అందుకు పత్తి పండించే ప్రతి రైతూ గురువారం నార్లాపూర్ గ్రామంలోని రైతు వేదిక వద్ద సంబంధిత గ్రామాల రైతులు రావాలని సూచించారు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కాటారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాటారం డివిజన్ కేంద్రానికి గురువారం రానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన చేరుకోనున్నారు. బీఎల్ఎం గార్డెన్స్‌లో కాటారం, మహాముత్తారం, మల్హర్, మహదేవపూర్, పలిమెల మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు మంత్రి అందజేస్తారు. నాలుగు మండలాలకు చెందిన 90 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 50 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ్ మాసోత్సవంలో పాల్గొంటారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన భవానీ భక్తులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో భవానీ మాలధారులు

రేగొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను రేగొండ మండలానికి చెందిన భవానీ మాలధారులు ఆయన నివాసంలో బుధవారం కలిసారు. ఏటా కరీంనగర్ పట్టణంలో బండి సంజయ్ ఆధ్వర్యంలో మహాశక్తిపీఠం దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 13మంది భవానీ మాలధారణ స్వాములు ఉత్సవాల్లో పాల్గొన్నారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో గండి తిరుపతిగౌడ్, ఎల్లండి నరేష్ సామల సురేందర్‌రెడ్డి, కందుకూరి కృష్ణ, గంధం శీనివాస్, నర్సింగరావు, దేవకారి ప్రతాప్, శివ, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషను కేటాయించాలి

టేకుమట్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి స్థానిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషను ఖరారు కాలేదని, ఈ సారి తప్పనిసరిగా కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు దూడపాక శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీగా ఏర్పడిన నాటి నుంచి ఎస్సీ రిజర్వేషను రాకపోవడం వెనుక అంతర్యమేమిటో చెప్పాలని పేర్కొన్నారు. అగ్ర కులాలకు చెందిన నాయకులు ధన బలంతో రిజర్వేషన్ రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్థానిక ఎన్నికల్లో రాఘవరెడ్డిపేట గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్‌ను ఖరారు చేయాలని కోరారు.

పాడి రైతులకు అవగాహన

మహదేవపూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : స్థానిక పశుజాతుల గుర్తింపు పాలసీలో భాగంగా నేషనల్ బ్యూరో ఆఫ్ ఎనిమల్ జెనెటిక్స్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో పాడి రైతులు, జీవాల పెంపకందారులకు మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సమారు 62 మంది పాడి, జీవాల పెంపకందారులు పాల్గొన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ పాడి పరిశ్రమకు మరింత ఊతమిచ్చే విధంగా లాభసాటి పద్ధతులను వివరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు ఏకాంబరం, నరిన్ కార్తికేయన్, గోపాలకృష్ణమూర్తి, వెంకన్న, మండల పశువైద్యాధికారి రాజబాపు గౌడ్ పశు మిత్రలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భూపాలపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత అన్నారు. పట్టణంలోని సుభాష్‌కాలనీలో సెక్టార్ స్థాయి సమావేశం బుధవారం జరిగింది. డీడబ్ల్యూవో మల్లేశ్వరి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ రజిత ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ మాసోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం గురించి వివరించారు. తీసుకోవాల్సిన కూరగాయలు, చిరుధాన్యాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోషణ అభియాన్ అధికారులు రవీందర్, యోచన, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణీలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై మాజీ ఎమ్మెల్యే అసంతృప్తి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా పరిధిలోని రామప్పకాలనీలో ఎక్కడి చెత్తా అక్కడే పడవేయడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆ కాలనీలోని దుర్గామాతను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా చెత్తా చెదారాన్ని గత 24 రోజులుగా తొలగించడం లేదని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే జీఎం రాజేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకొని వెంటనే పారిశుధ్యం సరి చేయాలని సూచించారు. టెండర్ ముగిసిపోయిన కారణంగా కొత్త టెండర్ ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, తద్వారా చెత్త తొలగింపు ఆలస్యమైందనే విషయం తెలపగా త్వరగా టెండర్‌ను పూర్తి చేయాలని, లేదంటే వేరే చోట పనిచేస్తున్న వారితో ఈ చెత్తను తొలగించేలా చూడాలని జీఎంను కోరారు. ఆయన వెంట టీబీజీకేఎస్ నేత బడితెల సమ్మయ్య, నాయకులు సింగనవేన చిరంజీవి తదితరులు ఉన్నారు.

బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయండి

కలెక్టర్ టీఎస్.దివాకర



బతుకమ్మ సంబరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ములుగు కలెక్టరేట్ ఆవరణలో ఈనెల 27న సాయంత్రం 3 గంటలకు జరిగే బతుకమ్మ సంబరాల్లో మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర కోరారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని, ఈ పండుగలో సమాజంలోని అన్నివర్గాల మహిళలు ఒక్కటిగా కలిసి జరుపుకోవడం ప్రత్యేకత పేర్కొన్నారు. జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు (అదనపు కలెక్టర్) ఎం.సంపత్‌రావు మాట్లాడుతూ బతుకమ్మ సంబరాల్లో ప్రతి మహిళా ఉద్యోగి పాల్గొని తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించాలన్నారు. ఈ కార్యక్ర మంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.శిరీష, జనరల్ సెక్రటరీ కందుల జీవన్‌కుమార్, నాయకులు ఆర్.రామకృష్ణ, రఫిక్, శైలజ,నాగశ్రీ, భగవత్‌గీత, అనంతలక్ష్మి, ఖమరున్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి : డీఎంహెచ్‌వో

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహించే స్కానింగ్ సెంటర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మెడికల్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్లతో పాటు ఇప్పటికే ఉన్న స్కానింగ్ సెంటర్లకు అనుమతి గురించి అడ్వైజరీ కమిటీ ముందు ఉంచామన్నారు. ఆరోగ్య శాఖ ఆదేశానుసారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగనిర్ధార పరీక్ష చేయడం చట్టారీత్యా నేరమని, వీరికి కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. సెక్స్‌రేషియో తక్కువగా ఉన్న మండలాలు ఒడితల, రేగొండ, కాటారం, చెల్పూర్, మహాముత్తారం, ఆజంనగర్‌లో విడు తల వారీగా ఆశా, ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించి డాక్యు మెంటరీ ఫిల్మ్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగరాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీదేవి, డాక్టర్లు కవిత, అనీషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ

కాటారం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం బతుకమ్మ, ఆయుధపూజ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం నుంచి సెలవులు ఉండటంతో కళాశాలకు చెందిన పలువురు మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. దసరా పండుగను పురస్కరించుకుని ముందస్తుగా మెకానికల్, ఈసీఈ ఇంజనీరింగ్ ల్యాబరేటరీలలో ఆయుధపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, లెక్చరర్లు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద తూము పునర్నిర్మాణం ఎన్నడు..?

నాలుగేళ్ల క్రితం ధ్వంసం



తూము ఉన్న ప్రదేశంలో వేసిన ఇసుక బస్తాలు, మట్టి

కాటారం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చెరువుకు పెద్ద తూము లేకపోవడంతో పంటలకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా తూము నిర్మాణం జరిగేదెన్నడని ప్రశ్నిస్తున్నారు. రెండు పంటలు పండించుకుని ప్రయోజనం పొందాలనుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిద్నెపల్లి గ్రామ పంచాయతీ పరిధి కోమటి చెరువు తూము నాలుగేళ్ల క్రితం ధ్వంసం కాగా ఇప్పటికీ పునర్నిర్మాణం జరగలేదు. తూము కూలిపోవడంతో నీరంతా చెరువు నుంచి వెళ్లిపోకుండా రైతులు తాత్కాలికంగా మట్టి, ఇసుక బస్తాలతో పూడ్చివేశారు. చెరువుకు రెండు తూములున్నా ధ్వంసమైన ప్రధాన తూము కిందనే 120కి పైగా ఎకరాలు సాగవుతుండగా మరో చిన్న తూము కింద 20కి పైగా ఎకరాలు సాగవుతాయి. పెద్ద తూము లేకపోవడంతో కొందరు రైతులు చెరువు కట్టపై నుంచి చెరువు నీళ్లల్లోకి పైపులు వేసి గాలి పీడనంతో నీరు వచ్చేట్టు ఏర్పాటు చేసి వచ్చిన కొద్దిపాటి నీరును పొలాలకు పారిస్తున్నారు. కోమటి చెరువుకు తూము నిర్మాణం చేసి తీవ్ర ఇక్కట్లు పడుతున్న తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అన్నపూర్ణదేవి అలంకరణలో శుభానంద అమ్మవారు

మహదేవపూర్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : దేవీశరన్న నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలోని శుభానందదేవి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నపూర్ణదేవిగా శుభానంద, సరస్వతీ అమ్మవార్లు

కాటారం మండలంలో భారీ వర్షం

కాటారం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి, బుధవారం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల పొలాల్లోకి వరద నీరు చేరింది. శంకరంపల్లి జీపీ పరిధిలో ఇళ్ల చుట్టూ, రహదారిపై వరదనీరు చేరి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా నిత్యం వర్షం ఏదో ఒక సమయంలో కురుస్తుండటంతో పత్తి పంటకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లరేగడి నేలల్లో పత్తి పంట ఎడతెగని వర్షాల దాటికి ఎర్రబారిపోవడం, కాయలు నల్లబడటం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో చెరువులు మరోసారి మత్తళ్లు దుముకుతున్నాయి.



మత్తడి దుముకుతున్న కాటారం చెరువు

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు

ములుగు రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పోషణ మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ములుగు సెక్టార్ ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బుధవారం సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శిరీష మాట్లాడుతూ గర్భిణులు, శిశువులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ఆరోగ్యానికి మేలు అన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిం చారు. అనంతరం శిశువులకు పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ములుగు సెక్టార్ సూపర్‌వైజర్ కావ్య, డీసీ మమత, బ్లాక్ కోఆర్డినేటర్ వెంకట్ రాజ్, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నవాబుపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు తీసుకోవాల్సిన బలవర్ధక ఆహారం, పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, శారద, ప్రతిభ, రజిత తదితరులు పాల్గొన్నారు.